క్లుప్తంగా

వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లకు పల్లకిసేవ గావించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అభిషేకాలు, పూజలు జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆహార పొట్లాల అందజేత



నెల్లూరు(అర్బన్): పద్మావతి సెంటర్‌లోని హరిత వృద్ధాశ్రమంలో ఆహార పొట్లాలను శనివారం పంపిణీ చేశారు. పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేషయ్య భార్య అంజనీదేవి ఐదో వర్ధంతిని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. నారాయణ డెంటల్ కళాశాల హెచ్‌ఓడీ నటరాజన్ కణ్ణన్, కేంద్ర ప్రభుత్వ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ పరవస్తు నాగ సాయిసూరి, పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, నేతలు దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రసూల్, రామదాసు, వీరయ్య, విశ్రాంత ఏఎస్పై మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మదర్ కేర్ యూనిట్ ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న రవికుమార్ తదితరులు

నెల్లూరు(అర్బన్): జిల్లాలో మాతా, శిశు మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో ఉచిత కంగారు మదర్ కేర్ యూనిట్‌ను వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన అన్ని పరికరాలతో కూడిన ప్రత్యేక అంబులెన్స్‌ను పొగతోటలో శనివారం ప్రారంభించారు. తొలుత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిచ్ చిన్నపిల్లల ఆస్పత్రి ఎండీ డాక్టర్ రవికుమార్ మాట్లాడారు. వెంటిలేటర్లు, మానిటర్లు, స్కానింగ్ యంత్రాలు తదితరాలతో కూడిన అంబులెన్స్‌లో ట్రస్ట్ వైద్య సిబ్బంది గ్రామాల్లోని గర్భిణుల వద్దకెళ్లి ముందస్తు పరీక్షలు చేస్తారని వివరించారు. ఐఓసీఎల్ డివిజనల్ రిటైల్ హెడ్ అనిల్ కుమార్, మేనేజర్ నరేష్‌కుమార్, వసంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సత్కారం



నెల్లూరు(బృందావనం): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి మహేంద్ర రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పురమందిర ప్రాంగణంలో గల వర్ధమాన సమాజ హాల్లో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన పలువురికి ప్రాణదాత పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. మధుసూదన్ రావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, జీవన్‌కుమార్, ముత్తు, శరత్‌కుమార్, గొట్టిపాటి నిర్మల, వెంకటసుబ్బారావు, డాక్టర్ చీదరాల చెన్నయ్య, లక్ష్మీనారాయణ, గులామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహార పంపిణీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు మాట్లాడారు. సభ్యులు రాఘవేంద్రశెట్టి, రమేష్‌బాబు, రవిచంద్ర, రాజారమేష్ సహకారంలో వీటిని అందజేశామని వివరించారు.

సమస్యల వలయంలో ఆర్టీసీ బస్టాండ్

- కొరవడిన పర్యవేక్షణ
- ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు



దుస్థితిలో ఉన్న తోటపల్లిగూడూరు ఆర్టీసీ బస్టాండ్

తోటపల్లిగూడూరు : మండల కేంద్రమైన తోటపల్లి గూడూరులో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. మండలంలోని తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం, తోటపల్లి, మాచర్లవారిపాళెం, మల్లికార్జునపురం, వరకవిపూడి, చంద్రశేఖరపురం, కోడూరు, అనంతపురం, వరిగొండ, ఈదూరు తదితర గ్రామాలకు ఈ బస్టాండ్ మీదునే ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు ఈ బస్టాండ్‌ను ఆశ్రయిస్తుంటారు. అయితే ప్రస్తుతం వసతుల లేమి కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. బస్టాండ్‌లో తాగునీటి కుళాయిలున్నా చుక్క నీరు రాదు. ప్రయాణికులకు దప్పిక వేస్తే గొంతు ఎండిపోవాల్సిందే. అలాగే మరుగుదొడ్లు ఉన్నా పర్యవేక్షణ కొరవడడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. దీంతో ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు, చిన్నారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బస్టాండ్‌లో ఆర్టీసీ సిబ్బంది లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల వేళలు తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతే కాకుండా చెత్తాచెదారాలతో బస్టాండ్ అస్తవ్యస్తంగా మారింది. బస్టాండ్ ప్రాంగణం గుంతలమయంగా ఉండడంతో వర్షాకాలం వస్తే బస్టాండ్ చిన్నపాటి చెరువును తలపిస్తుంది. దీంతో ఆర్టీసీ సిబ్బంది బస్సులను బస్టాండ్‌లోకి వెళ్లనియ్యకుండా మెయిన్ రోడ్డు మీదనే రాకపోకలు సాగించేస్తున్నారు. ఈ క్రమంలో బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు ఇబ్బందులు ఎదర్కోవాల్సి వస్తోంది. పాలకులు స్పందించి ఆర్టీసీ బస్టాండ్‌లో సరైన వసతులు కల్పించాలని కోరుతున్నారు.





బస్టాండ్‌లో నిరుపయోగంగా ఉన్న తాగునీటి కుళాయి, మరుగుదొడ్డి

చాముండేశ్వరీదేవికి గజ వాహనసేవ



అమ్మవారికి గజ వాహనోత్సవం

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నంలో ఉన్న చాముండేశ్వరీదేవికి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి గజ వాహనసేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలతో గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఉభయకర్తలుగా స్థానికులు వ్యవహరించారు. ఉదయం అమ్మవారికి చప్పర ఉత్సవం వేడుకగా సాగింది. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయ కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ప్రత్యేక అలంకరణలతో, విద్యుద్దీపాలంకరణలో ఊరేగుతున్న అమ్మవారిని దర్శించి భక్తులు తన్మయం చెందారు.

నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి సింహ వాహనోత్సవం జరుగనుందని నిర్వాహకులు తెలిపారు.

ఆర్‌ఎంపీలకు గుర్తింపునివ్వాలని వినతి

నెల్లూరు(అర్బన్): పీహెచ్‌పీలు, ఆర్‌ఎంపీలకు ప్రభుత్వపరంగా గుర్తింపునివ్వాలని పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు మంత్రి నారాయణను నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిసి జన్మదిన శుభాకాంక్షలను తెలియజేశారు. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, చౌకచర్ల భాస్కర్‌రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, పీహెచ్‌పీ నేతలు శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రసన్నాంజనేయుని బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ప్రసన్నాంజనేయస్వామి ఆలయం

కొడవలూరు : కొడవలూరులో వెలసిన శ్రీప్రసన్నాంజనేయస్వామికి ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు అత్యంత వేడుకగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని నిర్వాహకులు శనివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 3 గంటలకు సముద్ర స్నానం, రాత్రి 8 గంటలకు అంకురార్పణ, సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమత్ మూల మంత్ర హోమాలు, రాత్రి 9 గంటలకు విశేష పూజలు జరుగుతాయన్నారు. అదేవిధంగా మంగళవారం ఉదయం 9 గంటలకు స్వామివారికి విశేష పంచామృతాభిషేకం, సహస్ర నాగవల్లీ దళార్చన, సాయంత్రం 6 గంటలకు స్వామివారికి విశేష చందనాలంకరణ, పూలంగి సేవ, రాత్రి 9 గంటలకు స్వామివారికి విశేష అలంకారంతో గ్రామోత్సవం, బుధవారం సాయంత్రం 5 గంటల నుంచి విశేష ఉత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులు స్వామివారి పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నరుకూరు సెంటర్‌లో ట్రాఫికర్



అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలతో స్తంభించిన ట్రాఫిక్

- అడ్డదిడ్డంగా నిలుస్తున్న ఆటోలు, ప్రైవేటు వాహనాలు

తోటపల్లిగూడూరు : మండలంలోని నరుకూరు సెంటర్ నిత్యం వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. నెల్లూరు నగరానికి ఆరు కిలోమీటర్ల దూరంలోనే నరుకూరు సెంటర్ ఉంటుంది. దీనికి తోటపల్లిగూడూరు మండలంతో పాటు నెల్లూరు రూరల్, ఇందుకూరుపేట మండలాలకు కూడలిగా ఉంది. ఈ మూడు మండలాలకు ఇదే ప్రధాన వాణిజ్య కేంద్రం. కోడూరు బీచ్, తోటపల్లిగూడూరు మండల కేంద్రానికి నరుకూరు సెంటర్ నుంచే వాహనాల రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన నరుకూరు సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య గత కొంత కాలంగా జటిలంగా మారుతోంది. నరుకూరు సెంటర్‌లోని దుకాణాలు చొచ్చుకొని ముందుకు వస్తుండడంతో ఇక్కడ ఉన్న డబుల్ రోడ్డు సింగిల్ రోడ్డుగా కుదించుకుపోయింది. అంతేకాక తమను అడిగే వారు లేరని ఆటోలు, ప్రైవేటు వాహనాలు నడిరోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. దీంతో నరుకూరు సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. గ్రామీణ ప్రాంతమే కదా అని అటు అధికారులు, ఇటు పోలీస్ శాఖ నరుకూరు ట్రాఫిక్‌పై పెద్దగా దృష్టి సారించడం లేదు. దీంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నరుకూరు సెంటర్‌లో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాల్సి ఉంది.

పేదలకు వరం 'ఫ్యామిలీ డాక్టర్'



టపాతోపులో వైద్యసేవలు


- వైద్యాధికారి ఎం.రామకృష్ణ

కొడవలూరు : 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం పేదలకు వరం లాంటిదని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ సూచించారు. మండలంలోని టపాతోపులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. అనంతరం అనారోగ్యంతో ఇంటి వద్దే ఉంటున్న ఓ వ్యక్తి నివాసానికి వెళ్లి వైద్య పరీక్షలు చేసి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వల్ల గ్రామాల్లో ప్రభుత్వ వైద్యసేవలు మరింత అందుబాటులోకి వచ్చాయన్నారు. వ్యాధులు తీవ్ర రూపం దాల్చక ముందే గుర్తించి తగిన వైద్యం అందిస్తున్నట్లు తెలియజేశారు. గతంలో ఆస్పత్రులకు వెళ్లడంలో జాప్యం జరిగి వ్యాధి తీవ్రరూపం దాల్చి అనేక మంది ఇబ్బంది పడేవారన్నారు. ఇప్పుడా పరిస్థితి తలెత్తకుండా గ్రామాలకే వైద్యులు వెళ్లి పరీక్షించి వ్యాధులను గుర్తించి చికిత్స అందిస్తున్నామన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి సైతం ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎస్ సుజాత, ఏఎన్‌ఎం సలోమి, హెచ్‌ఏ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ స్నేహ, ఆశా కార్యకర్తలు శోభ, సరళ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొదలకూరు : మండలంలోని ప్రభగిరిపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీకాంత్ తెలిపారు. విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

సాహితీవేత్త రామచంద్రరావు కన్నుమూత



నెల్లూరు(బృందావనం): ప్రముఖ సాహితీవేత్త, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ వెన్నెలకంటి శ్రీరామచంద్రరావు (94) వయోభారంతో రాయాజీవీధిలోని తన స్వగృహంలో శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆయన భౌతికకాయానికి పలువురు నివాళులర్పించారు. ఆయన మరణం సింహపురి సాహితీ, విద్యారంగానికి తీరనిలోటని రచయితలు, కవులు ఈతకోట సుబ్బారావు, తుంగా శివప్రభాత్‌రెడ్డి, మద్దూరి శ్రీనివాసులు, డాక్టర్ సుబ్రహ్మణ్యం తదితరులు పేర్కొన్నారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో వేలం పాటలు



బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

విడవలూరు: మండలంలోని రామతీర్థంలో ఉన్న కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 27 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి తాత్కాలిక దుకాణాలు, కొబ్బరి చిప్పల సేకరణ హక్కులకు బహిరంగ వేలం పాటలను ఆలయ ప్రాంగణంలో గ్రామస్తుల సమక్షంలో దేవాదాయశాఖ అధికారులు శనివారం నిర్వహించారు. గతంలో రెండు సార్లు నిర్వహించిన వేలంపాటల్లో ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో మూడోసారి వేలంపాట జరిపారు. తాత్కాలి దుకాణాల ఏర్పాటు హక్కును నాశిన వెంకటేశ్వర్లు రూ.63 వేలు, కొబ్బరి చిప్పల సేకరణ హక్కును నట్టం ఉదయ్ రూ.27 వేలకు దక్కించుకున్నారు.

వెంకయ్యస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వెంకయ్యస్వామి

మనుబోలు : మనుబోలు–చెర్లోపల్లి మార్గంలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు వేదమంత్రోచ్చారణల మధ్య వెంకయ్యస్వామికి పంచామృతాభిషేకం జరిపించి పుష్పాలంకరణ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వద్ద హోమగుండం వేసి ధునిపూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని కొబ్బరికాయలు, పూలు పండ్లు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వీరంపల్లి గ్రామానికి చెందిన దివంగత పంటా సుమన్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నోట్, పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు అందుకున్న విద్యార్థులు

ముత్తుకూరు : ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలకు 25 శాతం మాత్రమే విద్యార్థులకు హాజరవుతున్నారు. ఈ సందర్భంగా స్కూల్లోని 140 మందికి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మరోవైపు మొదటి సారిగా ప్రవేశపెట్టిన జూనియర్ ఇంటర్‌లో తొమ్మిది మంది విద్యార్థులు చేరారని తెలియజేశారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



కొడవలూరు : యల్లాయపాళెంలో అవగాహన ర్యాలీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : అంగన్‌వాడీల బడిబాట ర్యాలీ

కొడవలూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి తెలిపారు. మండలంలోని యల్లాయపాళెం-2 అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో శనివారం అంగన్‌వాడీ బడిబాటపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఇక్కడ ఆట పాటలతో కూడిన విద్యతో పాటు సకాలంలో పౌష్టికాహారం అందించి ఆరోగ్యకరంగా ఎదిగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. పోషక విలువలున్న ఆహారం అందించడం ద్వారా పిల్లల్లో రక్తహీనత సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి, మహిళా పోలీస్ మేరి హెబ్సిబా, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

బుచ్చిలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శకుంతల మాట్లాడారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పడం ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందించడంతో పాటు పాఠశాలకు వెళ్లే విధంగా సంసిద్ధం చేస్తామని వివరించారు.

'నేను బడికి పోతా'పై ప్రత్యేక డ్రైవ్

- నీలగిరిసంగంలో ముగ్గురు చిన్నారులు పాఠశాలలో చేరిక



విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈఓలు

కొడవలూరు : మండలంలోని గుండాలమ్మపాళెం మజరా నీలగిరి సంగం గిరిజన కాలనీలో ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య శనివారం 'నేను బడికి పోతా'పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. కాలనీకి చెందిన ఐదుగురు విద్యార్థులు కొడవలూరు జెడ్పీ హైస్కూల్‌లో 7, 8 తరగతులు చదువుతూ అర్ధాంతరంగా బడి మానేశారు. బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నేను బడికి పోతా కార్యక్రమాన్ని ఈ నెల 13 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఎంఈఓలు నీలగిరి సంగంలో శనివారం పర్యటించి బడి మానేసిన పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, గిరిజన పిల్లలకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపేందుకు అంగీకరించారు. వెంటనే ఆ విద్యార్థులను కొడవలూరు హైస్కూల్‌లో 7, 8 తరగతుల్లో నమోదు చేశారు. సోమవారం నుంచి పిల్లలను యథావిధిగా బడికి పంపుతామని తల్లిదండ్రులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు ఉన్నారు.